

# గొప్పవాడు

నారంశెట్టి ఉమామహేశ్వర రావు

ఇరవయ్యేళ్లు నిండి మూతికి మీసాలూ, చేతులకి కండలు, డ్రాయరు స్థానే లుంగీలాంటి వెన్నో కొత్తగా వచ్చినా బుద్ధిమాంద్యం ఎక్కువ శేషుకి. గొప్ప అమాయకుడతడు. లోకజ్ఞానం బొత్తిగా లేదు.

అందుకే వాళ్ళమ్మ సుందరమ్మ 'నోరులేని నా కొడుకు ఈ లోకంలో ఎలా బ్రతుకుతాడో' అంటూ నుదురు కొట్టుకుంటుంది. నోరు లేకపోవడం అంటే తినడానికి నోరు అని కాదు. ఆ లెక్కన చూస్తే శేషు మూడుపూటలా సుష్టుగా భోంచేసి వెంటనే త్రేన్చేస్తుంటాడు. అదికాదు సమస్య.

ముందొక మాటా, వెనకొక మాట మాటాడే ఈ లోకంలో, 'ఏ ముందు ముల్లుంది చూస్కో' అని చెప్పి అది తీయడానికి ముందుకి వంగే తరుణంలో మన వెనకొక గొయ్యి తీసి, అందులోకి తోసేయడానికి ప్రయత్నించే ఈ లోకంలో, బుద్ధినిండా చెడు ఆలోచనలు పెట్టుకొని ముఖంమీద ఎల్లవేళలా చిరునవ్వు తాండవింపజేసే మహా క్రూరులున్న ఈ లోకంలో శేషులాంటి శుద్ధ బుద్ధావతారం బ్రతకలేడని వాళ్ళమ్మ భయం.

నిజమే మరి.

ఒకసారి శేషు మార్కెట్‌కి వెడు




తుంటే దారిలో ఒక దృశ్యం కనబడింది. కొంతమంది విద్యార్థులు తమ ఉపాధ్యాయుడికి నమస్కరిస్తున్నారు. అది చూసిన తర్వాత కానీ అతనికి తెలియలేదు. నమస్కారం పెట్టడమంటే సాధారణమైన వాళ్ళకి కాకుండా తమకంటే, గొప్పవారికి మాత్రమే చేస్తారని! అది తెలిసిన అతను ఆ వయసువాడయినప్పటికీ ఎంత పొంగిపోయాడంటే. 'యురేకా' అన్న పదం తెలియదు కనుక మౌనం వహించాడు కానీ లేకపోతే ఎగిరి గంతేసి అరిచేవాడు!

తనేదో గొప్ప ఘనకార్యం సాధించినట్లు ఇంటికి వెళ్ళి వాళ్ళ అమ్మకు ఆ విషయం చెప్పి "గొప్పవాళ్ళకి నమస్కరిస్తారన్న విషయం నీకు తెలుసా?" అని అడిగేడు. వాళ్ళమ్మ వాడి అమాయకత్వానికి లోపల మథనపడుతూనే "ఇప్పుడు తెలిసిందిగానీ, మార్కెట్ మంచి సరుకులు తెచ్చావా?" అంటే "అయ్యో! ఈ సంతోషంలో ఇటు వచ్చేశాను" అంటూ పరుగుపెట్టాడు

* * *

ఆరోజు ముఖ్యమంత్రిగారు వస్తున్నారని ప్రకటనచేస్తూ స్పీకర్‌లో ఎనౌన్స్ చేశారు ఆ ఊరిలో! ఆ సందర్భంగా బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని కూడా ప్రకటించారు.

ఇంట్లో కూర్చుని వాళ్ళ కుక్కకి పేలుతీస్తూన్న శేషు చెవిలో పడింది వార్త! అంతే!

"అమ్మా! నేను ముఖ్యమంత్రిగారి మీటింగ్‌కి వెళ్తున్నాను" అని చెప్పేశాడు.

సుందరమ్మ "అక్కడికి ఎంతో మంది జనం వస్తారు. వారిలో నువ్వు ముఖ్యమంత్రిని చూడలేవుగానీ వద్దు" అనేసింది!

"అలా అయితే ఇప్పుడే వెళ్ళి స్టేజికి ముందు వరుసలో కూర్చుండిపోదాము. ఇప్పుడెవరూ జనం ఉండరు కదా!" అంటూ మరొక మాటకు అవకాశం ఇవ్వకుండా వీధిలోకి పరుగు తీశాడు.

అలా వెళ్ళిన శేషు సాయంత్రం ఆరు తర్వాత ఇంటికి వచ్చాడు. అంత వరకూ సుందరమ్మ బిక్కుబిక్కుమంటూ చూస్తూనే ఉంది.

తిరిగివచ్చిన శేషు ముఖంలో ఎంతో ఆనందం కనిపించింది. ఏదో జరిగి ఉంటుందని ముందే ఊహించింది సుందరమ్మ.

"ఏరా శేషూ! ఏమిటి విశేషం?" అంటూ ఆప్యాయంగా ప్రశ్నించింది.

శేషు ఉత్సాహంగా చెప్పడం ప్రారంభించాడు. "నన్ను ఎప్పుడూ అమాయకుడు, వెర్రినాగన్న, పిచ్చిమాతంగి అంటావు కదా! మరి నేను సామాన్యుడిని కాదు తెలుసా? నేను ముఖ్యమంత్రి కంటె గొప్పవాణ్ణి తెలుసా?" అంటూ గర్వంగా ప్రశ్నించాడు.

"ఎలా?" అడిగింది సుందరమ్మ.

"మరేమో నేను ముందే వెళ్ళి స్టేజికి ముందు వరుసలో కూర్చున్నాను కదా! ముఖ్యమంత్రిగారు వచ్చి మాట్లాడే ముందు నావైపు చూస్తూ చేతులెత్తి నమస్కరించారు తెలుసా? ఈ రాష్ట్రానికే ముఖ్యమంత్రి అయిన అతడు నాకు నమస్కరించాడంటే నేను అతడి కంటె కూడా గొప్పవాణ్ణే కాదా?" అని అమాయకంగా ప్రశ్నించాడు శేషు.

సుందరమ్మకు శేషు అమాయకత్వానికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ముఖ్యమంత్రి సభ నుద్దేశించి చేతులెత్తి నమస్కరిస్తే, ముందుండటంవల్ల అది తనకే అని భ్రమించి, ఆ భ్రమించటంలో తాను ముఖ్యమంత్రి కంటే గొప్పవాణ్ణని ఊహించుకుంటున్న అమాయకుడైన తన చెట్టంత కొడుకుని చూసి ఏడవక ఏం చేస్తుంది ఏ తల్లయినా?

* * *

